


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 10-04-2026 సంపుటి: 07 సంచిక 311 పేజీలు: 8 వెల: రూ 3-00


# గత పాలకులు చేసిన పనులు చూసి నాకే మతి పోయింది : చంద్రబాబు



అమరావతి: భూమి అనేది ఆస్తి మాత్రమే కాదని.. జీవనాధారం, భద్రత, గౌరవం అని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. గత ప్రభుత్వం మీ భూమిపై కన్నేశారని అన్నారు. వేమూరు నియోజకవర్గం సూరేపల్లిలో 'మీ భూమి– మీ హక్కు ' సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఎం పాల్గొన్న సందర్భంగా ఆయన సభలో మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటిలో భూ వివాదాలకు తెరలేపారని, పట్టా పుస్తకం పైన ఆయన ఫోటో వేసుకున్నారని.. ఆస్తి మీది..ఫొటో ఆయనది అని విమర్శించారు. తల్లిని కోర్టుకు ఈడ్చిన వ్యక్తి మనకు ఆదర్శం కాదని, సెంటు భూమి కోసం కొట్లాడుకుని కుటుంబ సభ్యులు గొడవ పడుతున్నారని, చిన్న చిన్న భూతగాదాలు మనకు వద్దు అని అన్నారు. విభేదాలు ఉండే గ్రామాలు గుర్తించండని, మధ్యవర్తిత్వంతో భూ సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. గత పాలకులు చేసిన అక్రమాలు, పాపాలు వెంటాడుతునే ఉన్నాయని, గత పాలకులు చేసిన పనులు చూసి తనకే మతి పోయిందని మండిపడ్డారు. నూటికి 90 శాతం రెవెన్యూ సమస్యలపై అర్జీలే వచ్చేవని, మీకు భూహక్కు ఇచ్చే బాధ్యత తీసుకోవాలని అప్పుడే సంకల్పించానని తెలియజేశారు. 1.12 కోట్ల పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటామని, 16,816 గ్రామాలు రీ సర్వే చేయాలని అధికారులకు సూచించారు. 21.23 లక్షల కొత్త పాస్ పుస్తకాలు మీకు ఇచ్చామని, జూలై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని అన్నారు. ఇంకా 80 లక్షల పాస్ పుస్తకాలు ఇవ్వాలని, మీకు ఇచ్చే పాస్ పుస్తకాలు ఎవరూ తారుమారు చేయలేరని అన్నారు. కరెన్సీకి వాడే సాంకేతికతే పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడామని, మీ ముందే సర్వే చేయించి.. రికార్డు చేస్తామని, అన్నారు. ఈకెవైసి తీసుకునే పట్టాదారు పాస్ పుస్తకం ఇస్తామని, అవినీతి లేకుండా పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలని అనేదే తన అభిమతమని చంద్రబాబు పేర్కొన్నారు. పాస్ పుస్తకం ఎవరూ ట్యాంపర్ చేయకుండా బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకువచ్చానని, భూములు ఎవరూ కొట్టేయకుండా లాక్ సిస్టమ్ తెచ్చామని అన్నారు. అధికారంలోకి రాగానే ల్యాండ్ సీలింగ్ చట్టాలని రద్దు చేశామని, 22 ఏ నుంచి మీ భూములు తొలగిస్తామని హామీ ఇస్తున్నానని, భూ రిజిస్ట్రేషన్ల పద్ధతిలో కూడా మార్పులు తీసుకువస్తామని అన్నారు. మీ సమస్యలు పరిష్కరించడానికి ఇక్కడికి వచ్చానని అన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం ఇచ్చినప్పుడు మీలో కలిగిన సంతోషం చూసి తన జన్మ ధన్యమైందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్రం ఎంత విధ్వంసం అవ్వాలో అంత అయిందని, వైసిపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదని ధ్వజమెత్తారు. 21 నెలల్లో ప్రభుత్వం బాగా పనిచేసింది అంటే చేయి ఎత్తి ఆమోదం తెలపాలని, ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# మేదినీపూర్, నందిగ్రామ్ బాటలోనే బెంగాల్ అంతా హల్దియా సభలో ప్రధాని మోదీ

హల్దియా (పశ్చిమ బెంగాల్) ఏప్రిల్ 9: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ హల్దియాలో భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా అధికార తృణమూల్ కాంగ్రెస్ (ఒటిఅ) ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో మార్పు తుఫాను మొదలైందని,



ఈసారి బీజేపీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్ల క్రితం మేదినీపూర్, నందిగ్రామ్ ప్రజలు మార్పు కోసం ఏ బాటను చూపించారో, నేడు మొత్తం పశ్చిమ బెంగాల్ అదే మార్గంలో నడుస్తోందని ప్రధాని అన్నారు. 'నందిగ్రామ్‌లో గతంలో జరిగిన అద్భుతం, ఈసారి భవానీపూర్‌తో పాటు బెంగాల్ వ్యాప్తంగా పునరావృతం కాబోతోంది' అని ఆయన పేర్కొన్నారు. టీఎంసీ ప్రభుత్వం కేవలం అణచివేతకు, అవినీతికి ప్రాధాన్యం ఇస్తోందని, దీనిని ప్రజలు ఇక సహించబోరని హెచ్చరించారు. ఒకప్పుడు భారతదేశ పారిశ్రామిక కేంద్రంగా ఉన్న హల్దియాలో నేడు ఫ్యాక్టరీలు మూతపడ్డాయని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. 'హల్దియాలో పరిశ్రమలు మూతపడ్డాయి, కానీ చొరబాటుదారులు, నేరస్థుల దుకాణాలు మాత్రం బాగా సాగుతున్నాయి' అని ఆయన విమర్శించారు. బెంగాల్‌ను మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించడానికి బీజేపీ 6 గ్యారెంటీలను ఇస్తోందని ఆయన ప్రకటించారు. అందులో ముఖ్యంగా భయం లేని వాతావరణం, చట్టబద్ధమైన పాలన, అన్ని కుంభకోణాలపై విచారణ, బాధ్యులకు జైలు శిక్ష, 7వ పే కమిషన్ అమలు వంటి హామీలు ఉన్నాయి. రాష్ట్రంలోని యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని, బెంగాల్ వైభవాన్ని పునరుద్ధరించాలంటే ఈ కరుణ లేని ప్రభుత్వానికి వీడ్కోలు పలకడం అత్యంత ఆవశ్యకమని మోదీ పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు కేవలం అధికారం కోసం కాదని, బెంగాల్ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని ఆయన స్పష్టం చేశారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో 294 స్థానాలకు గాను ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. మే 4వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి.

# చిన్న తిరుపతి నకిలీ టికెట్ల స్కాంలో నిందితుల అరెస్ట్: డీఎస్పీ

ఏలూరు, ఏప్రిల్ 08: ద్వారకా తిరుమల నకిలీ టికెట్ల స్కాం వ్యవహారంలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రవణ్ కుమార్ వెల్లడించారు. ప్రధాన నిందితుడు రాజుతోపాటు మరో ఆరుగురు దేవస్థానం ఉద్యోగులను అరెస్ట్ చేశామని చెప్పారు. గురువారం ఏలూరులో డీఎస్పీ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. నిందితుల వద్ద నుంచి నకిలీ టికెట్ల ప్రింటింగ్‌కు ఉపయోగించిన ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది మార్చి రెండో వారంలో ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమలలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నకిలీ దర్శనం టికెట్ల విక్రయం బహిర్గతమైంది. ఆలయంలో స్కానింగ్ పాయింట్ వద్ద కొన్ని దర్శనం టికెట్లు స్కాన్ కాకపోవడంతో ఈ వ్యవహారం బట్టబయలు అయింది. ఈ వ్యవహారంలో దేవస్థానం ఏఈవో రమణరాజు కుమారుడు రాజు ప్రధాని నిందితుడు కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దేవాలయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో సిబ్బంది తగు జాగ్రత్తలు పాటిస్తుంటారు. భక్తులు.. కౌంటర్‌లో టికెట్లు కొనుగోలు చేసి దేవాలయంలో ప్రవేశించి.. స్కానింగ్ పాయింట్ వద్ద భద్రతా సిబ్బందికి వాటిని ఇస్తారు. వారు ఈ టికెట్లను స్కాన్ చేసి భక్తులను దేవాలయంలోకి అనుమతిస్తారు. ఆలయంలో ఏఈవో కుమారుడు రాజు దేవాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.200 టికెట్లను అతడు టికెట్ కౌంటర్‌లో



విక్రయించాడు. అవి ఆలయంలో స్కానింగ్ పాయింట్ల వద్ద స్కాన్ చేస్తే.. టికెట్లు స్కాన్ కావడం లేదు. దీంతో ఈ విషయాన్ని దేవస్థానం ఉన్నతాధికారుల దృష్టికి భద్రతా సిబ్బంది తీసుకెళ్లారు. వారు వెంటనే రంగంలోకి దిగి.. కౌంటర్‌లో జారీ చేసిన టికెట్లను పరిశీలించారు. అవి 61 టికెట్లు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ టికెట్లు జారీ చేసిన రాజును దేవస్థానం అధికారులు ప్రశ్నించారు. అనంతరం ఈ వ్యవహారంపై పోలీసులకు దేవస్థానం ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీంతో ఈ కేసులో మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

# మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్: ఈసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 09: అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాలోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23వ తేదీన ఒక దశలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది.

# రాజకీయ నేతల ప్రవర్తన, పనితీరు యువతకు ఆదర్శంగా ఉండాలి: అయ్యన్నపాత్రుడు



అమరావతి, ఏప్రిల్ 9: ప్రస్తుతం సమాజంలో కనిపిస్తున్న రాజకీయాలను యువత ఏవగించుకుంటున్నారని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. గోవాలో పశ్చిమ ప్రాంత కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో స్పీకర్ పాల్గొని ప్రసంగించారు. చట్టసభల్లో రభస చేయడానికి మాత్రమే పరిమితమై.. సభకు హాజరు కాకుండా జీతభత్యాలు తీసుకునే ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. వీళ్లు కళ్లేదురుగా కనిపిస్తుంటే యువతరానికి రాజకీయాలు అంటే గౌరవం ఎలా కలుగుతుందని ప్రశ్నించారు. ఈ ధోరణి మారాలంటే రాజకీయ నాయకుల నడవడిక మారాలని సూచించారు. చట్టసభల్లో వారి ప్రవర్తన, పనితీరు ఆదర్శప్రాయంగా ఉండాలన్నారు. విద్యార్థి దశలో రాజకీయాలకు దాదాపు తెరపడిందని స్పీకర్ తెలిపారు. రాజకీయ ప్రయోగశాలగా ఉండే విశ్వవిద్యాలయాల నుంచి విద్యార్థులు రాజకీయాల్లో ప్రవేశించడం దాదాపు శూన్యం అయిందన్నారు స్పీకర్. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి ఎందరో నవతరానికి, వారసత్వం లేని వారికి రాజకీయ అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. చంద్రబాబు నాయుడు తొమ్మిదిసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారని తెలిపారు. మహిళా రిజర్వేషన్ అమలులోకి వచ్చిన తరువాత చట్టసభల్లో 33 శాతం సీట్లు 40 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారికోసం రిజర్వ్ చేయాలని సూచించిన స్పీకర్.. అప్పుడే కొత్త నీరు వస్తుందని అభిప్రాయపడ్డారు. భిన్నంగా ఆలోచించకపోతే యువతను రాజకీయాలవైపు ఆకర్షించడం, వారికి అవకాశాలు కల్పించడం సాధ్యం కాదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.




# సంపాదకీయం

శుక్రవారం 10-04-2026

## మతమా... విశ్వాసమా....

దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తున్న శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టులో కీలక విచారణ కొనసాగుతోంది.'శబరిమలలో స్త్రీల ప్రవేశం' అంశంపై జరుగుతున్న విచారణ సందర్భంగా బుధవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఆచారాల్లో ఏది మూఢనమ్మకమో, కాదో నిర్ణయించే అధికారం, హక్కు న్యాయస్థానానికి ఉందని పేర్కొంది.న్యాయమూర్తులు చట్టం విషయంలో మాత్రమే నిపుణులు, మత విషయాల్లో కాదు. కాబట్టి న్యాయస్థానాలు మత ఆచారాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేవు' అన్న కేంద్ర ప్రభుత్వ వాదనకు ప్రతిస్పందనగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసిందిసుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్? సూర్యకాంత్? నేతృత్వంలో, 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం శబరిమల కేసును విచారణ చేస్తోంది. ఈ ధర్మాసనంలో జస్టిస్? బి.వి. నాగరత్న, జస్టిస్? ఎం.ఎం. సుందరేశ్?, జస్టిస్? అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్? అరవింద్? కుమార్?, జస్టిస్? అగస్టిన్? జార్జ్? మాసిహ్?, జస్టిస్? ప్రసన్న బి.వరాలే, జస్టిస్? ఆర్? మహదేవన్?, జస్టిస్? జోయ్? మాల్య బాగ్చీ ఉన్నారు. ఈ బెంచ్ ఆధ్వర్యంలో కేరళలోని శబరిమల ఆలయంతో సహా, వివిధ మత ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై, అలాగే వివిధ మతాల్లో ఉన్న స్త్రీ మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరుగుతోంది కేరళలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల వేళ ఈ విచారణ రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ధర్మాసనంలో జస్టిస్‌లు బీవీ నాగరత్నం, ఎంఎం సుందరేష్, అహసానుద్దీన్ అమానుల్లా సహా తొమ్మిది మంది న్యాయమూర్తులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు బలంగా వినిపించారు. శబరిమల ఆలయానికి సంబంధించి మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలు పూర్తిగా మతపరమైన విశ్వాసాలకు సంబంధించినవని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 25వ అధికరణం కల్పించిన మత స్వేచ్ఛను ప్రస్తావిస్తూ మతపరమైన ఆచారాలు ప్రజలకు భావాలకు, నైతికత, ఆరోగ్యం, వంటి అంశాలకు భంగం కలిగించినప్పుడు మాత్రమే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాలని ఆయన వాదించారు. మతపరమైన గ్రంథాలను అర్థం చేసుకోవడం, అవి ఏవీ నిర్దేశిస్తున్నయో నిర్ణయించడం న్యాయసమీక్ష పరిధిలోకి రాదని, దీనికి ఆధ్యాత్మిక మతపరమైన ఆచారం అనేది నిర్ణయించడానికి న్యాయస్థానాలు ప్రయత్నించడం సరైనది కాదని ఆయన వాదించారు. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్? మెహతా, "ఒక ఆచారం మూఢనమ్మకమని కోర్టు ఎలా నిర్ణయిస్తుంది? ఒక వేళ అది మూఢనమ్మకమని భావించినప్పటికీ, దానిని నిర్ధరించాల్సింది కోర్టు కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్? 25(2)(బి) ప్రకారం చట్టసభలు (లెజిస్లేచర్?)? మాత్రమే సంస్కరణ (రిఫార్మ్? లా) చట్టాలను తీసుకురావాల్సి ఉంటుంది. ఎలా అంటే, ఒక నిర్దిష్ట ఆచారం మూఢనమ్మకం అని, దానికి సంస్కరణ అవసరమని శాసనసభలు చెప్పవచ్చు. చేతబడి లాంటి ఆచారాలను నిరోధించడానికి ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు. 2018 నాటి శబరిమల తీర్పులో మహిళల ప్రవేశానికి అస్పృశ్యత కిందకు వస్తుందని అప్పటి ధర్మాసనం చేసిన వ్యాఖ్యలపై తుషార్ మొహతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ, ఒక మహిళను నెలలో మూడు రోజులు అంటరాని వ్యక్తిగా చూసి, నాలుగో రోజు ఆమె అస్పృశ్యురాలు కాదని చెప్పడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. అయితే మెహతా దీనికి సమాధానం ఇస్తూ శబరిమల విషయంలో ఆంక్షలు కేవలం వయసు ఆధారంగానే ఉన్నాయని, ఇది రుతక్రమంతో ముడిపడి లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ఇతర అయ్యప్పస్వామి దేవాలయాల్లో ఇన్ని వయసుల మహిళలకు ప్రవేశం ఉందని, శబరిమల విషయంలో ఉన్న ఆంక్షలు ఒక ప్రత్యేక సందర్భం అని ఆయన వివరించారు. ఒక వేళ ఏదైనా అశాస్త్రీయమైన ఆచారం ఉంటే, దానిని పరిష్కరించే బాధ్యత శాసనసభలకే ఉంటుందని కేంద్రం వాదించింది. దీనిపై జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ, న్యాయస్థానాలు సైన్స్ రంగంలో నిపుణులు కాకపోయినప్పటికీ, ఎవిడెన్స్ యాక్ట్ ప్రకారం నిపుణులు అభిప్రాయాలను సమీక్షించే అధికారం కోర్టులకు ఉంటుందని పేర్కొన్నారు. ఒక సామాజిక రుగ్మతను మతపరమైన ఆచారంగా ముద్రవేసినప్పుడు అది నిజంగా మతపరమైన అచారామా లేక సామాజిక దురాచారమా అని చెప్పే హక్కు కోర్టుకు ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. భారతీయ సమాజం మహిళలను ఎప్పుడూ గౌరప్రదమైన స్థానంలో ఉంచిందని, మనం దేవతలను పూజిస్తామని మెహతా ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రపతి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వరకు మహిళలు అత్యున్నత పదవులను అలంకరించారని, కాబట్టి ఇక్కడ పితృస్వామ్య భావజాలాన్ని ఆపాదించవద్దని ఆయన కోరారు. 2018 సెప్టెంబర్?లో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 4:1 మెజారిటీతో శబరిమల ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. మహిళ ప్రవేశంపై నిషేధం ఉండడం రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొంది. ఆ తర్వాత 2019 నవంబర్? 14న అప్పటి సీజేఐ రంజన్? గొగోయ్? నేతృత్వంలోని ధర్మాసనం 3:2 మెజారిటీతో ఈ అంశాన్ని 9 మంది సభ్యులుగల అత్యున్నత ధర్మాసనానికి బదిలీ చేసింది.ఈ విచారణలో సుప్రీంకోర్టు కేవలం శబరిమల తీర్పు మెరిట్‌లను మాత్రమే కాకుండా, మతపరమైన స్థలాల్లో మహిళలపై వివక్షకు సంబంధించి రూపొందించిన ఏడు కీలక ప్రశ్నలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేసింది

## 'వృద్ధులకు తోడుగా సంక్షేమ సంఘం సేవలు'

బీబీనగర్, ఏప్రిల్ 09 : అవసరాల్లో వృద్ధులకు తోడుగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి సంక్షేమ సంఘం సేవలు అందిస్తుందని వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాసుల సత్యనారాయణ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వయో వృద్ధుల సంక్షేమ సంఘం భవన మొదటి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు కలిసి కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ



దాతల సహకారంతో సంక్షేమ సంఘం భవనాన్ని నిర్మించి ప్రారంభించుకుని సంవత్సరం పూర్తయిందని తెలిపారు. భవనం నిర్మాణంలో దాతలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. వృద్ధుల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా ప్రణామ్ వయో వృద్ధుల విజ్ఞాన వినోద కేంద్రాన్ని వయో వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించాలని, వృద్ధుల పట్ల గౌరవభావం పెంపొందించాలని సూచించారు. సంఘ కార్యవర్గ సభ్యులు, వయో వృద్ధులు అందరూ కలసి సంఘాన్ని మరింత అభివృద్ధి చేసి ఆపద వచ్చిన వయో వృద్ధులకు అండగా నిలుస్తామని, ఎవరికి ఏ ఆపద వచ్చినా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వయో వృద్ధుల సంక్షేమ సంఘం ఆశ్రయ భవనం ప్రధాన కార్యదర్శి బొర్ర లింగారెడ్డి, ఉపాధ్యక్షులు ఎర్రం మనోహర్, సన్నిబోయిన ప్రసాద్, సహాయ కార్యదర్శి యాస నర్సింహారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి గొలనుకొండ ధర్మయ్య, సామ మల్లారెడ్డి, నాయకులు పలుగుల శ్రీనివాస్, సోమ ముత్యాలు, గోపాల్, ఓవల్దాస్ వీరేశం పాల్గొన్నారు.

## స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలి : డా.నవ జ్యోతి



రుద్రంపూర్, ఏప్రిల్ 09 : స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలని డా.నవ జ్యోతి అన్నారు. చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామ పంచాయతీలోజమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఈద్ మిలాఫ్" కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా ఇలా మహిళలంతా కలిసి ఒకరి పండుగలను, సంస్కృతులను మరొకరు పంచుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉపాధ్యాయురాలు లక్ష్మి మాట్లాడుతూ ప్రతి స్త్రీ కి విద్యా జ్ఞానం తప్పనిసరి అని, విద్యావంతురాలు అయినా మహిళల వల్ల సమాజ సంస్కరణ సాధ్యం అన్నారు.సేవా సమితి సభ్యురాలు సత్యావతి మాట్లాడుతూ., కుల మతాలకు అతీతంగా జమాతే ఇస్లామి హింద్ వైద్య, విద్యా, వివాహాలకు సహాయం చేస్తూ చేస్తున్న సేవలను కొనియాడారు. జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షురాలు మాట్లాడుతూ.. మనందరి సృష్టి కర్త అయినా దేవుడు ఒక్కడే అని, కలసి మెలసి జీవించడంలోనే దైవానుగ్రం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జమాత్ సభ్యులు పర్వీన్ సుల్తాన్, నస్రా, పర్వీన్ బాను, షేహనాజ్, పర్వీన్ షమీం. ఆశ వర్కర్లు జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు సరస్వతీ, ఉపాధ్యాయురాలు రాధా, రజీయా, వార్డు మెంబర్ అరీపా పాల్గొన్నారు.

## 'నర్రా రాఘవరెడ్డి స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి'

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 09 : ఆదర్శ ప్రజా నాయకుడు, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి స్ఫూర్తితో ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు చేయాలని పార్టీ శ్రేణులకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో అమరజీవి నర్రా రాఘవరెడ్డి 11వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో గోరంగా వైఫల్యం చెందారని, కేంద్ర ప్రభుత్వం ప్రజలపై విపరీతమైన భారాలను మోపిందని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి పాలకులు చట్ట సభలలో ప్రజా సమస్యలను చర్చించకుండా వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారన్నారు. కేరళ రాష్ట్రంలో ఎల్‌డీఎఫ్ కు వ్యతిరేకంగా



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పైన, వామపక్ష ప్రభుత్వం పైన యతి ప్రాస కోసం చేసే విమర్శలను తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. తెలంగాణ పర్యాటకంకేరళ రాష్ట్రం పేదరికం లేని రాష్ట్రంగా అభివృద్ధి చేసిన ఘనత వామపక్ష ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బడే బాయ్, చోటా బాయ్ మోదీ, రేవంత్ రెడ్డి ఇద్దరు కమ్యూనిస్టుల పైన విమర్శలు చేయడాన్ని కేరళ రాష్ట్ర ప్రజలు సహించరన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నాయని దుయ్యబట్టారు. రేషన్ కార్డులు, అన్ని రకాల పెన్షన్లు, ఇండ్లు ఇండ్ల స్థలాలు ఎప్పటి వరకు ఇస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. కొత్త రేషన్ కార్డులు వెంటనే ఇస్తున్న సన్న బియ్యంతో పాటు నిత్యవసర సరుకులను కూడా ఇవ్వాలన్నారు. యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలును వెంట వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫ్లోరైడ్ విముక్తి పోరాటంలో, ఎస్ఎల్‌బీసీ సొరంగంకై సాగిన పోరాటంలో నర్రా రాఘవ రెడ్డి ప్రముఖుడన్నారు. చట్ట సభలలో ఇప్పుడు జరుగుతున్న చర్చలు లాగా ఆరోజు లో లేవని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ ఎన్టీ రామారావు గారు కొన్ని ప్రత్యేక నిర్ణయాలు తీసుకున్నప్పుడు నిర్భయంగా ఆ నిర్ణయాలను వెంటనే ఉప సంహరించుకోవాలని రాఘవరెడ్డి కోరారు. నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ విముక్తి చేయాలనే తపనతోనే ఎస్ఎల్‌బీసీ సొరంగం అయితే ఆలస్యం అవుతుందని నార్ల తాతారావును వెంటబెట్టుకుని ఎన్టీ రామారావు దగ్గరికి తీసుకెళ్లి లిఫ్ట్ ద్వారా పూర్తి చేయాలని సూచించారు. అందుకు అనుగుణంగానే నేటి ఎస్ఎల్‌బీసీ లిఫ్ట్ స్కీమ్ అని చెప్పారు. తన జీవితమంతా పోరాటాలతో, సమస్యలతో కూడుకున్నప్పటికీ వడిదొడుకులు లేకుండా నమ్ముకున్న ఆశయం కోసం తుదకంట నిలబడ్డారని కొనియాడారు.సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య మాట్లాడుతూ.. నకిరేకల్ నియోజకవర్గంలో ప్రతి పెద్ద ఊర్లో హైస్కూల్ నిర్మాణం చేయించారని, మంచినీటి సమస్య, ఆరోగ్య సమస్యలు లేకుండా చూశారని చెప్పారు. ఆరోగ్య సమస్యలతో నాయకత్వం గాని, ప్రజలు అనారోగ్యానికి గురి అయినప్పుడు స్వయంగా వెంటబెట్టుకుని వైద్యం చేయించే వారిని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను తన సమస్యగా అనుకొని వారి సమస్యను వెంటనే పరిష్కరించిన మహనీయుడు నర్రా రాఘవరెడ్డి అన్నారు. అమరజీవి నర్రా రాఘవరెడ్డి పేరుతో షుగర్, బిపి, ఫిట్స్, పక్షవాతం రోగులకు మందులు ఇస్తున్నామని చెప్పారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పాలడుగు నాగార్జున, సయ్యద్ హాషం, చిన్నపాక లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రభావతి, ఎండి సలీం, నర్సిరెడ్డి, పి.వరలక్ష్మి, దండెంపల్లి సత్తయ్య, బాణాల పరిపూర్ణచారి, తుమ్మల పద్మ, అవుట రవీందర్, గాదె నరసింహ, బొల్లు రవీందర్, కండె యాదగిరి, పుష్పలత, కత్తుల యాదయ్య పాల్గొన్నారు.

## అస్సాం, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా పోలింగ్..



అస్సాం , కేరళ పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ భారీగా నమోదవుతోంది. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు బారులుతీరి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. మధ్యాహ్నం 3 గంట వరకు అస్సాంలో 75.91 శాతం, కేరళలో 62.71 శాతం, పుదుచ్చేరిలో 72.40 శాతం పోలింగ్ నమోదైంది. కేరళలో అయితే మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్లలో ఏకంగా 62.71 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడం గమనార్హం.దాంతో ఈసారి కేరళలో పోలింగ్ శాతం సరికొత్త రికార్డులు సృష్టించే అవకాశం ఉందని అంచనాలు వెలువడుతున్నాయి. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో తుది ఓటింగ్ శాతం '80%' మార్కును దాటుతుందా.. లేదా..? అనే విషయంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎందుకంటే 1987 తర్వాత కేరళలో పోలింగ్ ఎన్నడూ 80 శాతం దాటలేదు. ఈ క్రమంలో కేరళ ఎన్నికల ప్రధాన అధికారి రతన్ యు ఖేల్కర్ ఈసారి 85 శాతం పోలింగ్‌ను లక్ష్యంగా నిర్దేశించారు. అయితే 1960లో నమోదైన 85 శాతం పోలింగే ఇప్పటివరకు ఆ రాష్ట్రంలో ఆల్ టైమ్ రికార్డుగా ఉన్నది.గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటింగ్ సరళిలో స్పష్టమైన పెరుగుదల కనిపిస్తోంది. పినరయి విజయన్ తొలిసారి అధికారంలోకి వచ్చిన 2016 ఎన్నికల్లో 77 శాతం, ఆయన రెండోసారి గెలిచిన 2021లో 75 శాతం పోలింగ్ నమోదైంది. అయితే ఈసారి ఉదయం నుంచే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో బారులుతీరారు. సాధారణంగా కేరళలో పోలింగ్ శాతం పెరిగితే ఫలితాలు అనూహ్యంగా ఉంటాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తారు. ఈ నేపథ్యంలో పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి లాభిస్తుందనే దానిపై ప్రధాన పార్టీల్లో టెన్షన్ మొదలైంది. ఓటర్లలో పెరిగిన చైతన్యం, హోరాహోరీగా సాగిన ప్రచారమే ఈ భారీ ఓటింగ్‌కు కారణంగా తెలుస్తోంది.

## బారామతి బైపోల్స్.. తప్పుకున్న కాంగ్రెస్.. సునేత్ర పవార్ ఏకగ్రీవం !



ముంబై: మహారాష్ట్రలోని బారామతి నియోజకవర్గానికి జరగాల్సిన బైపోల్ ఎన్నికల నుంచి కాంగ్రెస్ పార్టీ తప్పుకున్నది. దీంతో ఎన్సీపీ నేత, డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల ఎన్సీపీ నేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిదే. ఈ నేపథ్యంలో బారామతిలో ఏప్రిల్ 23వ తేదీన ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తప్పుకోవడంతో.. సునేత్ర పవార్ ఎన్నిక ఏకగ్రీవం కానున్నది.పోటీ నుంచి తప్పుకోవాలని ఎన్సీపీ నేతలు శరద్ పవార్, సుప్రీయా సూలే.. కాంగ్రెస్ పార్టీని వేడుకున్నారు. జనవరిలో జరిగిన విమాన ప్రమాదంలో సునేత్ర పవార్ భర్త అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయారు. నెల రోజుల తర్వాత డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్ బాధ్యతలు స్వీకరించారు. పవార్ కుటుంబానికి బారామతి సీటు కంచుకోట. 1991 నుంచి అజిత్ పవార్ ఆ స్థానం నుంచి విజయం సాధించారు. అంతకన్నా ముందు బారామతి సీటు నుంచి శరద్ పవార్ ప్రాతినిధ్యం వహించారు.బారామతి ఎంపీగా ప్రస్తుతం సుప్రియా సూలే కొనసాగుతున్నారు. బైపోల్స్ నామినేషన్‌కు గురువారమే చివరి రోజు. అయితే బారామతి నుంచి తమ పార్టీ అభ్యర్థి అమర్ మోరే పోటీ చేయడం లేదని మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ హర్షవర్ధన్ సప్కాల్ తెలిపారు.

## రేవంత్ రెడ్డి వచ్చినంక నిద్ర కూడా రానంత భయమేస్తుంది.. చిరు వ్యాపారి ఆవేదన

జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాల పేరుతో మల్కాజ్‌గిరిలో బుల్డోజర్లతో రంగంలోకి దిగి ఫుట్‌పాత్‌పై ఉన్న చిరు వ్యాపారుల షాపులు తొలగించారని తెలిసిందే. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో చిరు వ్యాపారుల షాపులను తొలగిస్తున్నారు. షాపుల యజమానులు సామాన్లు సర్దుకునే సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా అధికారులు కనికరించకుండా నిర్దాక్షిణ్యంగా కట్టుబట్టలతో రోడ్డుపై వదిలేస్తున్నారు. దీంతో చిరు వ్యాపారులు ఉపాధి కరువై దిక్కు తోచని స్థితిలో రోడ్డున పడుతున్నారు.బుల్డోజర్ల దౌర్జన్యంలో షాపు కోల్పోయిన ఓ చిరు వ్యాపారి మాట్లాడుతూ.. మాకు చాయ్ బండీ, చిన్న పాన్ డబ్బా స్టాల్ ఉంది. మా బతుకే షాపు మీద.. ఇప్పుడు మొత్తమే తొలగిస్తా అంటే భయం రాదా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రుబాబ్‌తో బతుకుమని సపోర్ట్ ఇస్తుండే.. కానీ రేవంత్ రెడ్డి నుంచి ఒక సపోర్ట్ లేదు.. ఆశ లేదు. జీవితంలో మంచిగా బతికితే కూడా తప్పు. ఏం చేస్తుండో ఏమో ఆయనకన్నా అర్థమవుతుందో లేదో..? ఇల్లు అద్దెకే ఉంటున్నం. సొంతం ఏం లేదు. రోడ్డు మీద బతుకుతుంటే మొత్తం రోడ్డు మీదికి తెచ్చిండు.రేవంత్ రెడ్డి వచ్చినంక నిద్ర కూడా వస్తలేదు.. అంత భయమేస్తుంది. అసలు బతుకనిస్తలేదు. మాకు టైం కూడా ఇవ్వకుండా సడెన్‌గా వచ్చి సామాన్లు తొలగించి షాపులను తీసేసింద్రు. కనీసం మాటా లేదు. ఏం లేదు.. కాళ్లు పట్టుకుంటే కూడా వింటలేరు. ఏం చేయాలో చెప్పండి అని ఆవేదన వ్యక్తం చేశాడు.

# అమరావతిలో మినీ ఢిల్లీ

విజయవాడ, ఏప్రిల్ 9,ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. దీని కోసం రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేది తుది దశకు చేరుకుంది. ఢిల్లీలోని సెంట్రల్ వెస్టా తరహాలో, సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక సచివాలయ సముదాయాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న సుమారు 50కి పైగా కేంద్ర ప్రభుత్వ విభాగాలు, అనుబంధ సంస్థలు ఈ నూతన భవనంలోకి మారనున్నాయి. ఈ ప్రాజెక్టును కేవలం కార్యాలయ భవనంగానే కాకుండా, పర్యావరణ హితమైన గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మించనున్నారు. ఐకానిక్ డిజైన్‌తో కూడిన ఈ భవన సముదాయంలో సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనింగ్, అత్యాధునిక ఐటీ మౌలిక సదుపాయాలు, కాన్ఫరెన్స్ హాల్స్ , విశాలమైన పార్కింగ్ సౌకర్యాలు ఉ ఒడనున్నాయి. సుమారు 10 నుంచి 12 అంతస్తుల ఎత్తుతో నిర్మించనున్న ఈ భవనం, అమరావతి నగరానికే ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీని ద్వారా పాలనలో వేగం పెరగడంతో పాటు, ప్రజలకు అన్ని కేంద్ర సేవలు ఒకే చోట లభించే వెసులుబాటు కలుగుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రజా పనుల శాఖ పర్యవేక్షించనుంది. ప్రాథమిక అంచనాల ప్రకారం, ఈ సముదాయం నిర్మాణానికి సుమారు రూ. మూడు వేల కోట్ల వరకు వ్యయం కావచ్చని భావిస్తున్నారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములను దీని కోసం వినియోగించుకోనున్నారు. కేంద్ర కేబినెట్ నుంచి తుది ఆమోదం లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించి, రాబోయే రెండేళ్లలోపు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర సచివాలయ నిర్మాణం వల్ల అమరావతి ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకోనున్నాయి. వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఒకే ప్రాంతానికి రావడం వల్ల స్థిరాస్తి రంగానికి ఊతం లభించడమే కాకుండా, స్థానికంగా సేవా రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అమరావతిని కేవలం ఒక పరిపాలనా కేంద్రంగానే కాకుండా, జాతీయ స్థాయిలో ఒక కీలకమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు మైలురాయిగా నిలవనుంది.

ప్రాజెక్టు అంచనా వ్యయం:

సెంట్రల్ సెక్రటేరియట్: రూ. 1,299.08 కోట్లు.

ఉద్యోగుల నివాస సముదాయాలు: రూ. 1,234.91 కోట్లు.

నిర్మాణ విస్తీర్ణం:

ఈ భారీ ప్రాజెక్టు కోసం ఏపీ సీఆర్‌డీఏ ఇప్పటికే 22.53 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో 5.53 ఎకరాల్లో సచివాలయ భవనం, మిగిలిన 17 ఎకరాల్లో కేంద్ర ఉద్యోగుల కోసం బహుళ అంతస్తుల నివాస భవనాలను నిర్మించనున్నారు. కేంద్ర గృహ నిర్మాణ శాఖ పంపిన ఈ ప్రతిపాదనలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే ఆమోదం తెలిపారు.

ప్రముఖుల చొరవ:

ఈ ప్రాజెక్టు త్వరగా పట్టాలెక్కేలా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిరంతరం అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పర్యవేక్షించారు. మరోవైపు, ఇదే ప్రాంతంలో మరో 10 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తామని హుడ్‌కోవెల్లడించింది. దీనివల్ల అమరావతిలో జాతీయ, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణకు మార్గం సుగమం కానుంది.

# మామిడి రైతులపై యుద్ధ ప్రభావం



విజయవాడ, ఏప్రిల్ 9, భారత్‌లో మామిడి సీజన్ ప్రారంభమైందంటే ఎగుమతిదారులలో ఎంతో ఉత్సాహం కనిపిస్తుంది. కానీ, 2026 ఏప్రిల్ నెలలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పశ్చిమాసియాలో ముఖ్యంగా ఇరాన్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా భారతీయ మామిడి ఎగుమతులు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మేలైన రకాలపై ఆల్ఫాన్సో, కేసర్, మన తెలుగు రాష్ట్రాల్లోప్రసిద్ధి చెందిన బంగినపల్లి వంటి రకాల ఎగుమతులకు ఈ యుద్ధం పెద్ద అడ్డంకిగా మారింది. రెండు నెలలుగా కొనసాగుతున్న యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించింది. దీనికి తోడు ఎర్ర సముద్రంలో నెలకొన్న అలజడుల వల్ల ప్రధాన షిప్పింగ్ లైన్లు తమ నౌకలను కేప్ ఆఫ్ గుడ్ హోప్ మీదుగా మళ్లించాల్సి వస్తోంది. ఈ మార్పు వల్ల ప్రయాణం కాలం విపరీతంగా పెరగడమే కాకుండా ఓడరేవుల్లో రద్దీ పెరిగి కంటైనర్లు సకాలంలో తిరిగి రావడం లేదు. మామిడి వంటి త్వరగా పాడైపోయే పండ్ల రవాణాకు రీఫర్ అని పిలిచే రిఫ్రిజిరేటెడ్ కంటైనర్లు అత్యవసరం. ఈ కంటైనర్లలో ఉష్ణోగ్రతను కచ్చితంగా 11 నుంచి 18 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంచాలి. భారత్ సొంతంగా ఈ రీఫర్ కంటైనర్లను తయారుచేయదు. మనం పూర్తిగా అంతర్జాతీయ షిప్పింగ్ లైన్లపైనే ఆధాపడుతున్నాం. యుద్ధం కారణంగా ఈ కంటైనర్ల రాకపోకలు మందగించడంతో ప్రస్తుతం మార్కెట్‌లో వీటి కొరత తీవ్రంగా ఉంది. యుద్ధం కారణంగా రవాణా రంగంపై పడిన ఆర్థిక భారం సామాన్యులనుగ్రాఖ్ఖంతికి గురి చేస్తోంది. గల్ఫ్ దేశాలకు వెళ్లే సముద్ర రవాణా ఛార్జీలు కొన్ని మార్గాల్లో ఏకంగా 8 రెట్లు పెరిగాయి. యుద్ధం ఉన్న ప్రాంతాల గుండా ప్రయాణించే నౌకలపై బీమా ఛార్జీలు, అదనపు పన్నులు భారీగా పెరిగాయి. కేవలం మార్చి నెలలోనే రీఫర్ కంటైనర్ల ఛార్జీలు వెయ్యి డాలర్ల వరకు పెరిగాయి. కొన్ని మార్గాల్లో సుమారు నాలుగువేల డాలర్ల వరకు అదనపు పన్నులు విధిస్తున్నారు. ఇది సాధారణ రవాణా ఖర్చు కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. ప్రపంచ మామిడి ఉత్పత్తిలో భారత్ అగ్రమగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పండే మామిడిలో 44 శాతం అంటే సుమారు 20.68 మిలియన్ టన్నులు భారత్ నుంచే వస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ 56.5 మిలియన్ డాలర్ల విలువైన 29,938 టన్నుల తాజా మామిడి ఎగుమతి చేసింది. మన ఎగుమతుల్లో 40 శాతం నుంచి 45 శాతం వాటా గల్ఫ్ దేశాలదే. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉండే పీక్ సీజన్‌లో ఎగుమతిదారులకు ఇప్పటికే భారీ ఆర్డర్లు ఉన్నాయి. మామిడి పండు కోసిన తర్వాత కేవలం 28 రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది. సముద్ర మార్గంలో ప్రయాణ కాలం పెరగడం వల్ల పండ్లు గమ్యస్థానానికి చేరే లోపే పాడైపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల ఎగుమతిదారులు విమాన రవాణాను ఎంచుకోవాల్సి వస్తోంది. సముద్ర రవాణా ఖర్చు కేజీకి 50 నుంచి 80 రూపాయలు. విమాన రవాణా ఖర్చు కేజీకి 240 రూపాయల నుంచి 300 రూపాయలు. విమాన రవాణా దాదాపు ఐదు నుంచి ఆరు రెట్లు ఖరీదైనదిగా కావడంతో ఎగుమతిదారుల లాభాలు తగ్గిపోతున్నాయ. ఈ సంక్షోభం కేవలం ఎగుమతిదారులకే పరిమితం కాలేదు. మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని రైతులకు కూడా ఇది పెద్ద దెబ్బ. ఎగుమతులు నిలిచిపోతే, ఆ నిల్వలన్నీ స్థానిక మార్కెట్‌కు మళ్లుతాయి. దీని వల్ల దేశీయంగా మామిడి ధరలు భారీగా పడిపోయి రైతులకు కనీస పెట్టబడి పోటీని ఎదుర్కోవడంలో కూడా భారత్ వెనుకబడే అవకాశం ఉంది. ఈ సమస్య కేవలం మామిడికే పరిమితం కాలేదు. అరటి, ద్రాక్ష, ఉల్లిపాయలు, సీ ఫుడ్ వంటి త్వరగా పాడైపోయే వస్తువులపై కూడా ఈ ప్రభావం పడింది. ముంబైలోని జీఎస్పీటీ ఓడరేవులో వందలాది కంటైనర్లు నిలిచిపోయాయి.

# పవర్ ఫుల్ ఉమెన్ నుంచి జైలు గోడలవరకు...

## కళింగిరి శాంతి ప్రస్థానం

కాకినాడ, ఏప్రిల్ 9,దేవాదాయ శాఖలో అత్యంత వివాదాస్పద అధికారిగా పేరుపొందిన అసిస్టెంట్ కమిషనర్ కళింగరి శాంతి ఉదంతం, అధికార బలం ఉంటే వ్యవస్థలను ఎలా శాసించవచ్చో చెప్పడానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. కేవలం ఆరేళ్ల సర్వీసులో, అందులోనూ రెండేళ్ల సస్పెన్షన్ కాలం పోను, కేవలం నాలుగేళ్లలోనే ఆమె సృష్టించిన ప్రకంపనలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా ఏసీబీ దాడుల్లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయ్యి, 14 రోజుల రిమాండ్‌కు వెళ్లడంతో ఆమె అప్రతిహత ప్రస్థానానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. 2020లో దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరిన కళింగరి శాంతికి, అప్పటి అధికార పార్టీలో కీలక నేతగా ఉన్న విజయసాయి రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆ రాజకీయ అండతో ఆమె అటు ఉద్యోగ పరంగా, ఇటు వ్యక్తిగత జీవితంలోనూ తీవ్ర వివాదాలకు కేంద్రబిందువైంది. భర్త మదన్ మోహన్‌తో విడాకులు తీసుకోకుండానే మరొకరితో సహజీవనం చేయడం, ఒక బిడ్డకు జన్మనివ్వడం వంటి అంశాలు అప్పట్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఆ బిడ్డ తండ్రి ఎవరనే విషయంలో భర్త మదన్ మోహన్ చేసిన ఆరోపణలు, విజయసాయి రెడ్డికి డీఎన్ఏ పరీక్షలు చేయాలన్న డిమాండ్లు అప్పట్లో సంచలనం సృష్టించాయి. శాంతి అధికార దర్పం ఏ స్థాయిలో ఉండేదంటే, విశాఖపట్నంలో పనిచేస్తున్న సమయంలో తన పై అధికారి అయిన డెప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ గదిలోకి చొరబడి ఆయనపై ఇసుక చల్లడం ఆమె బరితెగింపునకు పరాకాష్ట. ఒక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఆమె ఈ చర్యకు పాల్పడటం గమనార్హం. ఈ ఘటన సీసీటీవీలో రికార్డ్ అయినప్పటికీ, విచారణాధికారి తప్పు పట్టినప్పటికీ, ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకోకుండా, ఫిర్యాదు చేసిన పై అధికారిని బదిలీ చేయడం వ్యవస్థల నిర్వీర్యానికి నిదర్శనం. దీంతో మనస్తాపం చెందిన డెప్యూటీ కమిషనర్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. విశాఖలో పని చేస్తున్న సమయంలో 'ప్రేమ సమాజం' భూములు, ఇతర దేవాదాయ భూముల లీజుల వ్యవహారంలో ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమెను సస్పెండ్ చేసినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఆమెను డిస్మిస్ చేసే ఫైల్ ముందుకు కదలలేదనే విమర్శలు ఉన్నాయి. కోర్టు ఆదేశాలతో మార్చి చివరి వారంలో తిరిగి పోస్టింగ్ పొందిన శాంతి, పది రోజులు గడవకముందే ఏసీబీ వలలో చిక్కుకుంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే అభియోగంపై ఏసీబీ ఆమెను అరెస్ట్ చేసి జైలుకు పంపింది. శాంతి ఉదంతం రెండు ముఖ్యమైన పాఠాలను నేర్పుతుంది. రాజకీయ నాయకుల మద్దతు ఉంటే చట్టాన్ని, నిబంధనలను అతిక్రమించవచ్చనే ధీమా అధికారులను ఎంతటి పతనానికి తీసుకెళ్తుందో శాంతి జీవితం ఒక హెచ్చరిక. ఒక జూనియర్ అధికారి ఇంతగా రెచ్చిపోతున్నా.. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఆమె విషయంలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయి. కోర్టు ఆదేశాలు ఇచ్చే వరకు లేదా ఏసీబీ దాడులు జరిగే వరకు వేచి చూడటం వ్యవస్థల బలహీనతను సూచిస్తుంది. మొత్తానికి, దేవాదాయ శాఖలో పవర్ ఫుల్ వుమెన్‌గా చలామణీ అయిన కళింగరి శాంతి ప్రస్థానం ప్రస్తుతం జైలు ఊచల వెనక్కి చేరింది. అధికార గర్వం, అవినీతి వెరసి ఒక అధికారి జీవితాన్ని అగాధంలోకి నెట్టేస్తాయో చెప్పడానికి ఈ స్టోరీ ఒక సాక్ష్యం.

# వైసీపీకి ముందున్న సవాళ్లు..వ్యూహాలే కీలకం..

ఒంగోలు, ఏప్రిల్ 9,గత ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటుస్థానం నుంచి పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఓటమి పాలవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఆయనకు ఆ ప్రాంతంతో ప్రత్యక్ష అనుబంధం లేకపోయినా, పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ పోటీకి దిగారు. చిత్తూరు జిల్లా ముఖ్యంగా చంద్రగిరి నియోజకవర్గం నుంచి వచ్చిన ఆయనను ఒంగోలు ప్రజలు పూర్తిగా అంగీకరించలేకపోయారని విశ్లేషణలు సూచిస్తున్నాయి. స్థానికంగా బలమైన ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ, అది విజయం సాధించేందుకు సరిపోలేదు. ఇదే సమయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి మారిన మాగుంట శ్రీనివాసులు రెడ్డి విజయం సాధించడం కీలక అంశంగా మారింది. ఆయనకు స్థానిక పరిచయం, ప్రజలతో అనుబంధం ఉండటం కూడా విజయానికి కారణమయ్యాయి. ఎన్నికల్లో కేవలం సామాజిక వర్గాల లెక్కలు సరిపోవు, ప్రజల మనస్తత్వం కూడా అర్థం చేసుకోవాలి అన్న విషయం ఇక్కడ స్పష్టమైంది. ఇలాంటి పరిస్థితులు మరికొన్ని చోట్ల కూడా కనిపించాయి. నెల్లూరు సిటీ నుంచి గుంటూరు జిల్లా నరసరావుపేట కు అనిల్ కుమార్ ను పంపించడం కూడా అప్పట్లో చర్చనీయాంశమైంది. స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా తీసుకున్న ఈ తరహా నిర్ణయాలు పార్టీకి ప్రతికూలంగా మారాయని కొందరు భావిస్తున్నారు. నాయకుల వ్యక్తిగత ఇమేజ్‌పై మాత్రమే ఆధారపడటం సరిపోదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## కులరాజకీయాలు....పెరుగుతున్న ఒత్తిడి

నెల్లూరు, ఏప్రిల్ 9, రాష్ట్ర రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం రోజు రోజుకు పెరుగుతోంది. ఒకప్పుడు పార్టీల అంతర్గత వ్యవహారాలుగా ఉన్న కుల ఆధారిత నిర్ణయాలు ఇప్పుడు బహిరంగ చర్చలకు వస్తున్నాయి. ప్రజలు కూడా తమ వర్గాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారు, ఏ మేరకు అవకాశాలు కల్పిస్తున్నారు అనే విషయాలను నేరుగా ప్రశ్నించే స్థాయికి వచ్చారు. ఇది రాజకీయ వ్యవస్థలో ఒక పెద్ద మార్పుగా భావించవచ్చు. ఇప్పటి వరకు రాజకీయ పార్టీలు టికెట్ల కేటాయింపులో సామాజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకున్నప్పటికీ, అది ఎక్కువగా పార్టీ లోపలే పరిమితమయ్యేది. సమాజంలో ఉన్న పరిస్థితులను బట్టి కొన్ని వర్గాలకు ఎక్కువ అవకాశాలు, మరికొన్ని వర్గాలకు తక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతూ వచ్చేది. అయితే, ఈ అసమానతలను చాలా వర్గాలు సహజంగా అంగీకరించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బోయ సమాజం పెద్ద సంఖ్యలో ఉంది. ఈ వర్గం చాలా కాలంగా ఎస్టీ హోదా కోసం డిమాండ్ చేస్తోంది. అదే విధంగా చిత్తూరు జిల్లాలో రెల్లి సమాజం గణనీయంగా ఉంది. వీరు వ్యవసాయం, సంప్రదాయ వృత్తులతో జీవనం సాగిస్తూ ఉన్నప్పటికీ, రాజకీయంగా తగిన గుర్తింపు లేదని భావిస్తున్నారు. ఇక ఉమ్మడి కృష్ణా జిల్లా లో వైశ్య వర్గం కూడా ఇప్పుడు రాజకీయంగా చైతన్యం పొందుతోంది. తమకు తగిన ప్రాతినిధ్యం లేదని భావిస్తూ వారు కూడా తమ డిమాండ్లను బలంగా వినిపిస్తున్నారు. తూర్పు గోదావరి,పశ్చిమ గోదావరి జిల్లాల్లో కేవలం కాపు వర్గం మాత్రమే కాకుండా, ఇతర సామాజిక వర్గాలు కూడా గణనీయంగా ఉన్నాయనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఇలా ప్రతి జిల్లాలోనూ కొన్ని వర్గాలు తమకు సరైన అవకాశాలు లభించడం లేదని భావిస్తున్నాయి. ఇప్పటి వరకు నియోజకవర్గాల సంఖ్య పరిమితంగా ఉండటం, పోటీ తీవ్రంగా ఉండటంతో ఈ అసంతృప్తి అంతగా బయటకు రాలేదు. కానీ పరిస్థితులు మారుతున్నాయి. త్వరలో జరిగే నియోజకవర్గాల పునర్విభజన కారణంగా సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉ ంది. దీంతో ప్రతి వర్గం తమకు ఎక్కువ ప్రాధాన్యం కావాలని కోరుతోంది. ముఖ్యంగా మండలాలు, పట్టణ స్థాయిలో నాయకత్వం వహిస్తున్న సామాజిక వర్గాల నేతలు ఈ డిమాండ్లను ముందుకు తెస్తున్నారు. ఇది క్రమంగా రాష్ట్ర స్థాయిలో పెద్ద చర్చగా మారుతోంది. అన్ని రాజకీయ పార్టీలపై ఈ ఒత్తిడి పెరుగుతోంది. ప్రతి వర్గాన్ని సంతృప్తి పరచాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఈ పరిస్థితుల్లో టికెట్ల కేటాయింపు ప్రక్రియ పార్టీలకు పెద్ద సవాల్‌గా మారే అవకాశం ఉంది. సమతుల్యత పాటించకపోతే అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. అందుకే ఈసారి ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక నిజంగా కత్తిమీద సాములా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కర్నూలులోనే మూడు ప్రధానా కార్యాలయాలు

కర్నూలు, ఏప్రిల్ 9, కర్నూలులోని రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్ అమరావతికి తరలించాలని దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టేసింది. వక్ఫ్ ట్రైబ్యునల్‌ను అమరావతిలో కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కోర్టుకు లాయర్ తెలిపారు. మరోవైపు లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను కూడా కర్నూలులోనే కొనసాగిస్తామని ప్రభుత్వం తెలిపింది. 2021లో కార్యాలయాల తరలింపు పిల్‌లు దాఖలయ్యాయి. తాజాగా ప్రభుత్వ క్లారిటీ ఇవ్వడంతో ఈ మూడు ముఖ్యమైన కార్యాలయాలు కర్నూలులోనే కొనసాగనున్నాయి. కర్నూలులోనే వక్ఫ్ ట్రైబ్యునల్, లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ) కార్యాలయాలు కొనసాగుతాయని ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఏపీ హైకోర్టులో రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్ తరలింపుపై పిల్ దాఖలైంది.. కర్నూలలో ఉన్న వక్ఫ్ ట్రైబ్యునల్‌ను అమరావతికి తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని 2021లో సామాజిక కార్యకర్త మహ్మద్ ఫరూఖ్ షిబ్లి హైకోర్టును కోరారు. ట్రైబ్యునల్ మినహా వక్ఫ్‌బోర్డు, తదితర మైనారిటీ సంస్థలన్నీ విజయవాడలో ఉన్నాయని పిటిషనర్ తరఫు లాయర్ కోర్టులో వాదనలు వినిపించారుపరిపాలనా సౌలభ్యం కోసం ట్రైబ్యునల్‌ను అమరావతికి తరలించాలని పిటిషనర్ తరఫు లాయర్ కోరారు. వక్ఫ్ సంస్థలు, ఆస్తులు, వివాదాలకు సంబంధించిన ఎక్కువ కేసులు కర్నూలుతో పాటుగా చుట్టుపక్కల జిల్లాల్లో ఉన్నాయని ప్రభుత్వం తరఫున లాయర్ వాదించారు. హైకోర్టు కూడా వక్ఫ్ ట్రైబ్యునల్ కర్నూలులో ఉండటంలో న్యాయం ఉందని అభిప్రాయపడింది.. ఈ మేరకు షిబ్లీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం కొట్టేసింది. అంతేకాదు కర్నూలు నుంచి అమరావతికి హెచ్‌ఆర్సీ, లోకాయుక్తలను తరలించాలని 2021లో హైకోర్టులో పిల్‌లు దాఖలయ్యాయి. ఈ క్రమంలో తాజాగా కర్నూలులో ఉన్న మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ), లోకాయుక్త అంశంపై ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తరఫున లాయర్ కోర్టుకు తెలిపారు. మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ)లో ఏపీ, తెలంగాణ మధ్య సిబ్బంది విషయమై విభజన జరగాల్సి ఉందన్నారు. ఇటు లోకాయుక్తను కూడా త్వరలో నియమిస్తామని తెలిపారు. ప్రభుత్వ తరఫు లాయర్ కోర్టుకు తెలిపిన వివరాలను పరిగణనలోకి తీసుకుని విచారణను వాయిదా వేసింది. గత ప్రభుత్వ హయాంలో లోకాయుక్త, హెచ్‌ఆర్సీ కార్యాలయాలను కర్నూలుకు తరలించారు. అయితే ఈ రెండు కార్యాలయాలను అమరావతికి తరలించాలని హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యాలు దాఖలయ్యాయి.. వాటిపై హైకోర్టు విచారణ చేస్తోంది. అంతేకాదు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశం కూడా తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే.

# తిరుపతిలో 10 అంతస్తుల్లో బస్ స్టాండ్

తిరుపతి, ఏప్రిల్ 9, తిరుపతికి శ్రీవారి దర్శనం కోసం నిత్యం భారీగా భక్తులు తరలివస్తుంటారు. ఈ మేకు భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు నగరంలో ప్రస్తుతం ఉన్న బస్టాండ్ స్థానంలో ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు రూ. 470 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణాన్ని ఈపీసీ విధానంలో నిర్మించాలని అధికారులు నివేదికను పంపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిలో మౌలిక వసతుల్ని మరింత మెరుగుపరిచేందుకు సిద్ధమైంది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం నిత్యం వేలాదిమంది భక్తులు తిరుపతికి వస్తుంటారు. ఈ క్రమంలో తిరుపతిలో మరిన్ని మౌలిక వసుతల్ని కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించింది. తిరుపతిలో ప్రస్తుతం ఉన్న మెయిన్ బస్టాండ్ స్థానంలో కొత్తగా ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ నిర్మించాలని నిర్ణయం తీసుకోగా.. తాజాగా దీనికి సంబంధించి కీలక ముందడుగు వేసింది. తిరుపతి ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్‌కు ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో నిర్మించాలని తేల్చారు. తిరుపతిలో ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీకి చెందిన బస్టాండ్ స్థలంలో.. ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ (నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్) బస్ టెర్మినల్‌ను రూ. 470 కోట్ల అంచనాతో ప్లాన్ చేశారు. ఈ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించి మూడు విధానాలను (బీవోటీ, హామ్, ఈపీసీ) అధ్యయనం చేశారు. వాటిలో ఈపీసీ బావుంటుందని ప్రభుత్వానికి ప్రతిపాదనల్ని కూడా పంపారు. తిరుపతి బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్, తిరుమల, ఆ చుట్టుపక్కల ఉన్న ఆలయాలకు వెళ్లే భక్తులకు ఈ టెర్మినల్ కీలకంగా మారింది.. అందుకే దీనికి ఇంటర్ మోడల్‌గా పేరు పెట్టారు. ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ డీపీఆర్ తయారు చేసేందుకు రైట్స్ (రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ లిమిటెడ్)ను సలహా సంస్థగా నియమించారు. ప్రస్తుతం ఉన్న తిరుపతి బస్టాండ్, డిపో కలిపి మొత్తం 13.18 ఎకరాల్లో ఉంది. ఇందులో 7.11 ఎకరాల్లో ఈ బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు. రోడ్డు పక్కన ఉన్న 4.29 ఎకరాలను కమర్షియల్‌గా అభివృద్ధి చేయనున్నారు. 99 సెంట్ల భూమిని రోడ్డు కోసం, 79 సెంట్ల భూవిని ఫ్లై ఓవర్ కోసం నిర్మించనున్నారు. బస్ టెర్మినల్‌లో పార్కింగ్ కోసం సెల్లార్‌లో రెండు అంతస్తులు ప్లాన్ చేశారు. ఇలా ఆయ సదుపాయాల కోసం భూమిని కేటాయించారు. ప్రస్తుత ప్లాన్ ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం టెర్మినల్‌కు కేటాయిస్తారు. మొత్తం 98 ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం.. టెర్మినల్ ప్రాంగణంలో మరో 50 బస్సులు నిలిపేందుకు వీలుగా స్థలం కేటాయించనున్నారు. టెర్మినల్ గ్రౌండ్ ఫ్లోర్ పైన 10 అంతస్తులు నిర్మించి కమర్షియల్ (హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలకు, మిగిలిన షాపులకు) కేటాయిస్తారు. అంతేకాదు టెర్మినల్‌లోని పదో ఫ్లోర్‌లో హెలీప్యాడ్ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ టెర్మినల్ నుంచి బస్టాండ్, రైల్వే స్టేషన్‌ను కనెక్ట్ చేసేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇటీవల అధికారులు ఈ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నవారితో అధికారులు మాట్లాడారు.. వారి నుంచి అభిప్రాయాలసేకరించి పభుత్వానికి నివేదిక పంపించనున్నారు. కమర్షియల్‌గా కేటాయించబోయే వాటితో లాభాల పరిస్థితి.. ఆర్టీసీకి ఎంత ఇస్తారు, ఒప్పందం ఎన్నేళ్లు అనే అంశాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను మరో చోటికి తరలిస్తే 5 ఎకరాల భూమి, డిపో కోసం మరో ఐదు ఎకరాలు తాత్కాలికంగా కేటాయించాలని ఆర్టీసీ జిల్లా కలెక్టర్‌ను కోరింది.

# ప్రభుత్వ నిధులలో అక్రమాలకు పాల్పడుతూ చేతివాటం చూపుతున్న మండల విద్యాశాఖ అధికారి -2 మధుసూదన్ పై చర్యలు తీసుకోవాలి...

- డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు..



విభారే న్యూస్ ఏప్రిల్ 09 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు మండల, పట్టణ ప్రభుత్వ పాఠశాలల్లో కల్చరల్, స్పోర్ట్స్ నిర్వహణ కోసం విడుదల చేసిన నిధులలో చేతివాటం చూపుతున్న మండల విద్యాశాఖ అధికారి మధుసూదన్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మండల డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్ర గౌడ్ కి వినతిపత్రం ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రాము, ఉపాధ్యక్షుడు దేవా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 3, 4 తేదీలలో నిర్వహించాల్సిన కల్చరల్, స్పోర్ట్స్ కార్యక్రమాల కోసం ప్రతి పాఠశాలకు రూ. 20,130/- నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. మండలంలోని ఎంఈఓ-2 పరిధిలోని 13 పాఠశాలలకు కూడా ఈ నిధులు విడుదలైనప్పటికీ, సంబంధిత మండల విద్యాశాఖ అధికారి-2 మధుసూదన్ ఈ నిధులను పూర్తిగా పాఠశాలలకు అందించకుండా, ప్రధానోపాధ్యాయులను బెదిరించి సంతకాలు తీసుకుని కేవలం రూ. 17,000/- మాత్రమే ఇచ్చినట్లు ఆరోపించారు. ఈ విషయం బయటకు వెల్లడిస్తే ఉద్యోగాల నుండి తొలగిస్తామని హెచ్చరిస్తూ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ విధంగా ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తూ ఎంఈఓ-2 హోదాకు కళంకం తెచ్చిన మధుసూదన్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా, విడుదల చేసిన పూర్తి మొత్తాన్ని 13 పాఠశాలలకు అందించేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుని, ఆయనను వెంటనే ఎంఈఓ-2 హోదా నుండి తొలగించాలని కోరారు. ఇకముందు ప్రతి పాఠశాలకు నిధులను చెక్కుల రూపంలో పారదర్శకంగా చెల్లించే విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, వరుణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరులో 'జనగణన-2027' శిక్షణా కార్యక్రమం ప్రారంభం..





విభారే న్యూస్ ఏప్రిల్ 09 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్, ఛార్జ్ ఆఫీసర్ ఎన్. గంగిరెడ్డి ఆధ్వర్యంలో 'జనగణన-2027' ప్రక్రియకు సంబంధించి ఎన్యుమరేటర్ల శిక్షణ నేడు ఘనంగా ప్రారంభమైంది. పట్టణంలోని వైష్ణవి జూనియర్ కళాశాల వేదికగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆర్.ఓ మేనేజర్ ఇన్చార్జ్ అస్లాం బాషా, టి.పి.ఓ రాజేష్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ఏప్రిల్ 9, 10 మరియు 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఫీల్డ్ ట్రైనర్లు నర్సప్ప మరియు లక్ష్మణ్ ఎన్యుమరేటర్లుగా వ్యవహరిస్తున్న సచివాలయ ఉద్యోగులకు జనగణన నిర్వహణ తీరుపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. డేటా సేకరణలో పాటించాల్సిన మెళకువలు, సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఈ గణన ప్రక్రియలో సచివాలయ ఉద్యోగులు అత్యంత కీలమని, క్షేత్రస్థాయిలో ప్రతి వివరానికీ ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణను ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకొని జనగణనను విజయవంతం చేయాలని కమిషనర్ ఎన్. గంగిరెడ్డి కోరారు.

# ఎన్యూమరేటర్లకు శిక్షణ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 09:పట్టణ పరిధిలో జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు రామకృష్ణ పీజీ కాలేజీలో ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న మాట్లాడుతూ, జనగణన ప్రక్రియలో ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమని, ప్రతి వివరాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. శిక్షణలో గృహాల లెక్కింపు విధానం, కుటుంబ వివరాల సేకరణ, డేటా నమోదు పద్ధతులు, ఆన్‌లైన్ నమోదు విధానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, మున్సిపల్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. జనగణన ప్రక్రియను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ఘనంగా జరుగుతున్న పోషణ్ పక్వడా కార్యక్రమలు..

- పోస్టర్స్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి, మున్సిపల్ కమిషనర్..

- ఐసీడీయస్ ప్రాజెక్ట్..





విభారే న్యూస్ ఏప్రిల్ 09 ఎమ్మిగనూరు..మహిళభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఎమ్మిగనూరు ఐ సి డి ఎస్ ఎం ప్రాజెక్ట్ పరిధిలోని గోనెగండ్ల, యెమ్మిగనూరు, నందవరం మండలాలలో ఏప్రిల్ 9 వతేది నుండి 23 వతేది వరకు పోషణ్ పక్వాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పోషణ్ పక్కవాడ కార్యక్రమమం మునిసిపల్ ఆఫీస్ నందు ఎమ్మెల్యే బీవీ జాయనాగేశ్వరెడ్డి ద్వారా పోస్టర్స్ ఆవిష్కరించడం జరిగినది. ఈ కార్యక్రమం లో మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి హాజరయ్యారు. ఈ 15 రోజులు జరిగే పోషణ్ పక్కవడకార్యక్రమాలలో గర్భిణీ బాలింతల పిల్లల కు మెరుగైన ఆరోగ్య సేవలు సమగ్రంగా అందించాలని బిడ్డ పుట్టినప్పటి నుంచి 2 సంవత్సరాలు వచ్చేలోపు బిడ్డ యొక్క మెదడు అభివృద్ధి 80% జరుగుతుందని. ఈ వయస్సులో పిల్లలయొక్క పోషణ - సంరక్షణ అనేది ముఖ్యం. కాబట్టి ఈ వయస్సులో పిల్లలకు మొబైల్స్ కీ దూరంగా ఉంచాలని, అట్లాగే ప్రాసెసింగ్ ఫుడ్స్ కీ,రెడీ టు కుక్, ఆహారపదార్థాల వినియోగన్ని పూర్తిగా గా తగ్గించి సహజమైన, పోషక విలువలు గల ఆహారపదార్థాలను ఇంట్లోనే తయారు చేసి ఇవ్వాలి. బయటి ఆహార పదార్థాలలో అధిక సోడియం, స్టేబ్లీజర్ చేసిన ఆహారపదార్థాలు, కుర్ కురెలు, చిప్స్ , మ్యాగీ లు జంక్ ఫుడ్స్ ఇవ్వడం పిల్లలకు హానికరం కాబట్టి వాటి బదులుగా ఇంట్లో తయారు చేసుకున్న ఆహార పదార్థాలు పల్లీలు, పప్పులు, అన్నిరకాల గుగ్గిళ్లు శనగలు,అని రకాల పండ్లు,వంటిఆరోగ్యకరమైన ఆహారపదార్థాలను పిల్లలకు స్నాక్స్ గా ఇవ్వాలని చెప్పడం జరుగుతుంది. ఈ పోషణ్ పక్కవాడ కార్యక్రమాల్లో పురుషుల భాగస్వామ్యం కావాలి. పిల్లల సమగ్ర అభి వృద్ధి అనేది జరగాలంటే తల్లి,తండ్రి ఇద్దరి బాధ్యత ఉంది. ఈ పోషణ్ పక్కవాడ కార్యక్రమాలు ప్రతి అంగన్వాడి సెంటర్లో లో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు వివిధ శాఖ అధికారులు అందరు పాల్గొని విజయవంతం చేయాలి. ఈ పోషణ్ పక్వడ కార్యక్రమలలో ఆరోగ్య శాఖ వారి సమన్వయము తో ప్రైవేట్ హాస్పిటల్స్ ప్రభుత్వ హాస్పిటల్స్ లలో కూడా తల్లి తండ్రులకు పిల్లల పోషణ - సంరక్షణ గురించి తల్లి తండ్రులకు అవగాహన కలిగిస్తారు. అని ఎమ్మిగనూరు సిడిపిఓ తెలిపారు. పోషణ్ పక్వడా లో భాగంగా కటికవీధి ఉర్దూ స్కూల్ నందు తల్లుల సమావేశం నిర్వహించి పిల్లలకు ఇవ్వవలసిన ఆహార ఆరోగ్య విషయాల గురించి చెప్పడం జరిగినది..

# కొత్తబురుజులో నల్లా కనెక్షన్ల ప్రారంభం--

రూ.30 లక్షల పనులకు శ్రీకారం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఏప్రిల్ 09:డోన్ మండలం కొత్తబురుజు గ్రామంలో ఇంటింటికీ శుద్ధజలాన్ని అందించేందుకు నల్లా కనెక్షన్ల పనులను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ప్రారంభించారు. జిల్లా మినరల్ ఫండ్ ద్వారా రూ.30 లక్షలతో చేపట్టిన ఈ పనులను ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డితో



కలిసి ప్రారంభించారు.సీఎం హామీ మేరకు ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛ భారత్ కింద 30 మందికి రూ.4.5 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం కూడా చేపట్టినట్లు చెప్పారు. మంజూరైన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.హార్టికల్చర్ పంటలతో రైతులకు అధిక ఆదాయం సాధ్యమని సూచించారు. అలాగే చెరువులు, ఫీడర్ ఛానల్స్ అభివృద్ధితో నీటి సమస్యలు తగ్గించేందుకు 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఇంటికి శుద్ధజలం అందించడం ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులు ప్రోత్సహిస్తామని తెలిపారు.

# శ్రీశైలం వేదికగా మత్స్యకార సమ్మేళనం--

ఆకర్షణగా నంద్యాల మార్కెట్ ప్రసాద్---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 09-నంద్యాల జిల్లా శ్రీశైలం మహా క్షేత్రంలో మత్స్యకార సంక్షేమ సమితి (ఎంఎస్ఎస్) ఆధ్వర్యంలో 21వ ఆధ్యాత్మిక హిందూ సమ్మేళన సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సు రెండు రోజుల పాటు భక్తి, సామాజిక చైతన్య వాతావరణంలో నిర్వహించబడుతోంది. ఈ సమ్మేళనానికి ఆప్కాఫ్ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్



గారు ముఖ్య అతిథిగా హాజరై మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్ర మరియు జిల్లా స్థాయి కార్యవర్గ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని సమితి కార్యక్రమాలకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నంద్యాల మార్కెట్ ప్రసాద్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సభలో పాల్గొన్న రాష్ట్ర, జిల్లా నాయకులతో ఆయన సాన్నిహిత్యంగా మెలిగి అందరి దృష్టిని ఆకర్షించారు. మత్స్యకారుల సమస్యలు, వారి జీవనోపాధి అభివృద్ధిపై చర్చిస్తూ, సమాజానికి సేవ చేయడంలో తన బాధ్యతను మరింతగా పెంచుకుంటానని తెలిపారు. మార్కెట్ ప్రసాద్ చురుకైన పాత్రపై నాయకులు ప్రశంసలు కురిపించారు. భవిష్యత్తులో మత్స్యకారుల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. సమ్మేళనంలో ఆధ్యాత్మిక ప్రసంగాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడగా, మత్స్యకారుల ఐక్యతకు ఇది వేదికగా నిలిచింది. భారీ సంఖ్యలో సభ్యులు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 09:-సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా చేరవేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు. గురువారం బేతంచెర్ల మండలం ఆర్.కొత్తపల్లె సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆన్‌లైన్ హాజరు పరిశీలనలో గైర్హాజరు సిబ్బందిపై షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. రిజిస్టర్ల నిర్వహణ, పరిశుభ్రత, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై మార్గదర్శకాలు ఇచ్చారు. రీసర్వే సిబ్బంది అందుబాటులో లేరని రైతులు ఫిర్యాదు చేయగా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# శుభ గురువారం వేళ వెంకన్న నేత్ర దర్శనం---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 09-కలియుగ ప్రత్యక్ష దైవం, భక్తుల కోరికలు తీర్చే శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి గురువారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సంజీవనగర్ కోదండరామాలయం ప్రాంగణంలో ఉన్న శ్రీ భగవత్ సేవా సమాజ్ మందిరంలో స్వామివారికి ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తదనంతరం



తోమాల సేవ, అర్చనలు, నైవేద్యాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రతి గురువారం నిర్వహించే స్వామివారి నేత్ర దర్శనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ''గోవిందా గోవిందా'' నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు క్రమశిక్షణతో దర్శనం చేసుకోవాలని సూచించారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఈ ఆలయంలో ప్రతి గురువారం నేత్ర దర్శనంతో పాటు ప్రత్యేక సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# వాట్సాప్ ఈ-గవర్నెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి---

నంద్యాల అర్బన్ తాసిల్దార్ శ్రీనివాసులు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 09:ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లు మరియు వాట్సాప్ ఈ-గవర్నెన్స్ సేవల ద్వారా ప్రజలకు అనేక సేవలు సులభంగా అందుబాటులో ఉన్నాయని నంద్యాల అర్బన్ తాసిల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు . గురువారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే



దరఖాస్తులు, సేవలను పొందవచ్చని చెప్పారు. వాట్సాప్ ఈ-గవర్నెన్స్ సేవల కోసం 9552300009 నంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని తాసిల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ పని ఉన్నా నేరుగా అధికారులను సంప్రదిస్తే వేగంగా, పారదర్శకంగా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. దళారుల ద్వారా పనులు చేయించుకోవాలని ప్రయత్నిస్తే ఆర్థిక నష్టం తప్పదని స్పష్టం చేశారు. అవసరమైతే తనను నేరుగా సంప్రదించవచ్చని చెప్పారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పనులు ఉంటే ఉదయం వేళల్లోనే పూర్తి చేసుకుని, మధ్యాహ్న వేళల్లో బయటకు రావడం తగ్గించాలని తెలిపారు. అవసరమైతే సాయంత్రం 5 గంటల తర్వాత పనులు చూసుకోవాలని సూచించారు.

# ముందస్తు పన్ను చెల్లింపులకు రాయితీలు--

మున్సిపల్ కమిషనర్ బి శేషన్న---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 09:నంద్యాల పురపాలక సంఘం పరిధిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులను ముందస్తుగా చెల్లించే పౌరులకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి శేషన్న తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ 30, 2026 లోపు అడ్వాన్స్ పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఇవ్వబడుతుందని తెలిపారు. అలాగే పాత బకాయిలను ఏకమొత్తంగా చెల్లించే వారికి యాభై శాతం వడ్డీ మాఫీ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పన్నుల వసూళ్లను సులభతరం చేసేందుకు పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెలవు రోజుల్లో కూడా ఈ కౌంటర్లు పని చేస్తాయని వెల్లడించారు. అలాగే ఆన్లైన్ ద్వారా అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్ మరియు వాట్సాప్ ఈ గవర్నెన్స్ సేవల ద్వారా కూడా పన్నులు చెల్లించే సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. వాట్సాప్ ఈ గవర్నెన్స్ సేవల కోసం 9552300009 నంబర్ ను వినియోగించుకోవచ్చని తెలిపారు. పట్టణ అభివృద్ధి కోసం పన్నులు సమయానికి చెల్లించడం ప్రతి పౌరుడి బాధ్యత అని కమిషనర్ తెలిపారు. పట్టణ అభివృద్ధి పనులు వేగవంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**